# ఆట



వీ ర



శివాలయం సెంటర్లో మేళం జరుగుతోంది. పెట్రోమాక్సు లైట్ల కాంతిలో మేళం సభ్యులు భువి నుండి దివికి దిగి వచ్చిన అప్సరసల్లా మెరిసి పోతున్నారు.

వాళ్ళు కట్టుకున్న చీరల జరీ అంచులు తళుక్కున మెరుస్తున్నాయి.

కొంచెం ఎక్కువగానే చేసుకున్న మొహం మీద మేకప్ చెమట బిందువులకి కరిగి పోతోంది.

మట్టూ రసిక మహారాజుల కళ్ళలో కోరికల చూపులు తాచు పాములై బుసలు కొడుతున్నై.

ఆ వాతావరణమంతా వేడిగా వుంది. హోయి హోయిగా వుంది.

''ఒరేయ్ - ఆ మధ్య నున్న దాన్ని ఆడమన్నా. ఏం మిడిసి పడతాంది. ఈ నోటు దానికియ్యేహ'' ఓ రసిక శిఖామణి విలాసంగా ఓ వంద నోటు ఫెళఫెళలాడిస్తూ పక్కనున్న కుర్రాడికిచ్చి పంపాడు.

ఆ కుర్రాడు స్టేజి ఎక్కి - మధ్యన నుంచున్నామె దగ్గర కెళ్ళి నోటందించి- దాన్ని పంపిన విలాస పురుషుడి కేసి చూపించాడు.

ఆమె మునివేళ్ళతో ఆ నోటు అంటీ అంటనట్టుగా అందుకుని-

ముక్కూ నొసలు చిట్లించి పెదవి విరచి 'హూ' అన్నట్టు చిన్న చప్పుడు చేసి, నోటు గాల్లోకి ఎగరేసి, లెక్కలేనితనంగా, నిర్లక్ష్యంగా తల ఎగరేసింది.

ఆ తర్వాత-

ఎంతమంది రసికులు ఎన్ని విధాల ప్రయత్నించినా ఆమె ఆడలేదు - పాడలేదు.

నుంచున్న తీరు మారలేదు.

గీర తగ్గ లేదు.

ఎటో ఎత్తిపెట్టిన మొహం దించలేదు.

అంతే!

ఆ వార్త దావానలంలా పందిట్లోంచి బైట పబ్లిక్‌లోకి వ్యాపించింది.

మేళంలో ఓ పిల్లుందట.

మిరుమిట్లు గొలిపే మెరుపులాంటి పిల్ల!

ఆ అందానికి బైర్లు కమ్మాల్సిందే!

ఆటొచ్చినా అడ్డం లేదట-

పాటొచ్చినా పొద్దం లేదట-

ఆ ప్రదేశమంతా గోల గోల...

జనంలో ఎవరేనా ముచ్చటపడి మేళంలో ఫలానా పిల్ల ఆడాలంటే - ఆమె ఆడాలి.

అందులో ఎవరేనా ఓ నోటిచ్చి ఆడమంటే తప్పకుండా ఆడాలి.

అది మేళం మర్యాద.

అలా అలా ఆ విషయం నిర్వాహకుల దాకా వెళ్ళింది.

వాళ్ళు అర్జెంటుగా ఈ విషయాన్ని మేళం నాయకురాలితో 'టేకప్' చేశారు.

నాయకురాలు చెప్పినా ఆ పిల్ల పాడలేదు, ఆడలేదు. ఓ రకమైన 'రాజ్యాంగ సంక్షోభం' ఏర్పడింది. ఓ నిర్వాహకుడు వెళ్ళి ''ఇన్ని వేలిచ్చి మీ మేళం కట్టించింది ఎందుకనుకుంటున్నావ్. నువ్వు ఆడనంటే పెద్ద గొడవైపోతుంది. మా పరువు మర్యాదలు మంట గలిసిపోతాయ్. ఏంటి నీ బాధ'' అనడిగాడు.

''పక్క వీధిలో గోపాల కృష్ణని రమ్మను. అతనొస్తే పాటా పాడతాను, ఆటా ఆడతాను'' అంది.

''ఓస్- ఒక్క నిముషం'' అని అతను తారాజువ్వలా పరుగెత్తాడు.

# భ ద్ర రా వృ ప మ్కి

మొత్తం ప్రాపంతటికీ అందగత్తె-

ఎవరెన్ని చెప్పినా, బతిమాలినా ఉలకక పల కక రాయి మల్లే వుండిపోయిన పిల్ల-

తన కోసం కబురంపిందనగానే-

పేక ముక్కలు, డబ్బులు అక్కడే వదిలేసి రెక్కలు కట్టుకుని జి.టి. ఎక్స్‌ప్రెస్ స్పీడులో అక్కడికొచ్చేసాడు గోపాల్‌క్రిష్ణ.

ఆ పిల్లని ఎప్పుడూ తాకిన గుర్తు కాదు గదా- చూసిన గుర్తు కూడా లేదతనికి.

బహుశా తన గురించి ఆ ఊళ్ళో వేరే మేళం సభ్యులెవరో చెప్పి వుంటారు అను కున్నాడతను శ్రీ గోపాల క్రిష్ణ-

ఆరడుగుల అందగాడూ కాదు- ఆజాను బాహుడూ కాదు. అరవింద దళాయతాక్షుడు అసలే కాదు. పైగా గెడ కర్రలా వుంటాడు. పీలగా వుంటాడు. ఎప్పుడూ దండల వరకు మడిచిన తెల్ల టెర్లిన్ చొక్కా వేసుకుని వుంటాడు. బాగా ఆముదం రాసి అటూ, ఇటూ ఎగ దువ్విన క్రాపూ, మధ్య నుంచి నుదుటి మీదకు పీక్కున్న ముళ్ళలాంటి వెంట్రుకలూ, వొదులు పైజమా లోంచి బొమికలు కనబడే పొడుగు కాళ్ళూ-

అతను కార్టూన్ బొమ్మలా వుంటాడు.

చదువుకునే రోజుల్లో ఆడపిల్లలు అతన్ని ఎస్.కె. గోపాల్‌క్రిష్ణ అని పిలిచేవాళ్ళు- అంటే - సన్నకాళ్ళ గోపాల్‌క్రిష్ణ అన్న విషయం అతనికి ఇప్పటిదాకా తెలియదు.

తను అందంగా ఉండనన్న సంగతి కూడా పాపం ఖచ్చితంగా అతనికి తెలియదు.

ఇప్పుడీ పిల్ల ఇలా కబురంపగానే ఎక్కడ లేని కళా అతని మొహంలో కదిలింది.

తళతళలాడిపోతున్నాడు అతను.

అతడిని చూసి ఆ పిల్ల ముందు కొచ్చింది.

ఎప్పుడూ అయిష్టంగా నాలుగ్గెంతులు గెంతి చేతులు గాల్లో ఆడించి, స్టేజిని నాలుగు తన్నులు తన్ని ఆట ముగించిందనిపించే ఆ మనోరమ...

ఆరోజు ఎంతమంది బ్రతిమలాడినా, ఎన్ని వంద నోట్లు ఆమె చుట్టూ పరిభ్రమించినా కదలిక మెదలిక లేని ఆ మనోరమ-

ఆ పూట నిజంగా నెమలి పిట్టల్లే ఆడింది.

శృంగార తరంగంలా ఎగిసిపడింది.

నాగమల్లి పూవల్లే పొడవుగా వుండే ఆ పిల్ల సౌందర్యం- ఆ సౌందర్యం వెదజల్లే సౌరభం, మహా మహుల్నే మూర్ఛిల్ల చేస్తుంది.

అల్లాంటిది - రః కుర్ర నాగన్న ఓ లెక్కా?

ఆ మెరిసే కోల చెంపలూ-

ముక్కు మీంచి దూసుకొచ్చే మోహపు చూపూ-

హృదయాన్ని కదిలింగి, ఊగించి, శాసించే ఆ కళ్ళ కాటుక పిట్టల రెపరెపలూ-

ఒక్కొక్కప్పుడు ముడుచుకుని, మరో ప్పుడు కొంచెంగా తెరుచుకుని, ఏదో మొగ్గలా, మొగ్గ విచ్చుకుని పువ్వైనట్టు తోచే ఆ ఎర్రటి నోరూ-

ఆ పై-

వెర్రెక్కించే ఆ గుండెల ఊపూ-

ఎటు తిరుగుతుందో తెలీకుండా, గిలకలా గిర్రున చూపుకి చిక్కకుండా కదిపే సన్నని నడుమూ-

గోపాల క్రిష్ణ కళ్ళ కాంక్షతో నిండాయి.

అపుడే-

చిటికెన వేలుకి చుట్టుకున్న లేత తమల పాకు చిలకని కొంత ముందు కొచ్చి అతగాడి నోటి కందించింది మనోరమ.

అంతే!

అది చిటికెన వేలా? కాదు - స్వర్గపురానికి సూచిక. అది లేత తమలపాకా? కాదు - ఆమె అధరామృతాన్ని అందించే పల్చటి నాలుక.

స్వయంవరంలో వేలాది మంది చక్రవర్తుల్ని కాదని ఓ అందాల రాకుమార్తె కేవలం తన మెళ్ళో దండేసినట్ట్టు ఫీలయ్యాడు గోపాల్‌క్రిష్ణ.

ఆ రాత్రి-

మనోరమ గోపాల్‌క్రిష్ణ వేలందుకుని స్వర్గా నికి తీసికెళ్ళింది.

రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ లాంటి అందగత్తెలంతా తన ముందు 'బలాదూర్' అని స్పష్టం చేసింది.

ఆ తర్వాత అతనామెను వదల్లేకపోయాడు.

ఆమె శరీరాన్ని వదల లేకపోయాడు.

అలా - అలా - కొన్నెల్లు గడిచింది.

గోపాల్‌క్రిష్ణ మనోరమ గుండెల్లో అన్ని నెలలూ కళ్ళు మూసుకుని వుండిపోయాడు.

కాని- ఓ రోజున అతని తల్లి కళ్ళు తెరిచింది.

నగల పెట్టె చూసుకుని ఘొల్లుమంది.

ఏడువారాల నగల్లేవు.

ఇనప్పెట్టె చూసుకుని లబోదిబోమన్నాడు తండ్రి.

లక్ష రూపాయల క్యాష్ లేదు.

అపుడు ''ఎవత్తెరా? అది?'' అనుకుంటూ, ఎగురుకుంటూ మనోరమ ఇంటి ముందు కెళ్ళాడు అతని తండ్రి శివన్నారాయణ, అతని కేకలు, రంకెలు వింటే ఏదో లోకం లోంచి ఏదైనా దెయ్యం వచ్చిందేమో అనిపిస్తుంది కాని, అతన్ని చూస్తే బక్క చిక్కిన నల్లకుక్క పిల్ల జ్ఞాపకం వస్తుంది.

అతని కేకలకి మనోరమ భయపళ్ళేదు.

ఇంట్లోంచి బైటికి రాలేదు.

అతన్నే లోపలకి రమ్మని కబురంపింది.

పులిలా గర్జిస్తూ గాండ్రిస్తూ లోపలికి వెళ్ళాడు శివన్నారాయణ.

''మర్యాదగా నా కొడుకుని వదిలెయ్. వాడి దగ్గర కొట్టేసిన నగలూ, డబ్బూ ఇక్కడ కక్కు'' అన్నాడు.

''ఎవడబ్బ సొమ్మంట?'' ఓ ముసలావిడ రంగంలోకి వచ్చింది.

''ఎవడబ్బ సొమ్మా? నా సొమ్మే. గోపాల క్రిష్ణబాబు గాడి సొమ్ము- ఏంటనుకుంటు న్నావో ముసిల్దానా? మీ చేత పైసా పైసా కక్కిస్తాను'' అంటూ ఊగిపోయాడు.

''ఓసోస్- నీ ఎదవన్నర మొకానికి సొమ్ము కూడానా? బస్టాండులో మూటలు మోసుకునే ఎదవ్వి- నీకు ఏడు వారాల నగలు ఎక్కణ్ణుంచి వచ్చినాయంట?''

దిమ్మతిరిగింది శివన్నారాయణకి.

''మా అమ్మకి కేరేజీలు మోసి మోసి- ఆవిడ చివర కాలంలో కళ్ళు కనబడనపుడు నగలూ, డబ్బూ ఎత్తుకుపోయిన దగుల్బాజీవి నువ్వే కదా- ఇన్నేళ్ళకి నా డబ్బు, నగలూ నాకు దక్కాయి. వాట్ల కోసమే ఊర కుక్క లాంటి నీ కొడుకుని చంక నెక్కించుకుంటా. ఇంక దయ చెయ్'' అని పక్కకి తిరిగి-

''ఒరేయ్ నాగులూ'' అని పిలిచింది మనో రమ.

వీర వస్తాదు లాంటి మనిషి గంట కొట్టినట్టు ప్రత్యక్షమయ్యాడు.

''ఏంటి సెల్లమ్మా'' అనడిగాడు వస్తాదు.

''వీడింకో మాట మాట్లాడితే కాళ్ళూ చేతులు విరిచేసి పొయ్యిలో పెట్టెయ్'' అని వెనక్కి తిరిగి చూడకుండా లోపలికెళ్ళిపోయింది.

శివన్నారాయణ మూటలు మోసుకునే శివ న్నలా ముడుచుకుని వెళ్ళిపోయాడు.

గోపాల్‌క్రిష్ణ మళ్ళీ ఎపుడూ ఆ ఇంటి ఛాయల్లో కన్పించలేదు.

ఆ తర్వాతెపుడూ మనోరమ ఆట కట్ట లేదు.